
# దొరల బండ

గోపరాజు నాగేశ్వరరావు



అన్ని పల్లెటూళ్ళకు మల్లేనే ఆవూళ్ళోనూ ఇంకా ఓ బొడ్రాయుంది. దాన్ని ఎప్పుడు, ఎవరు, ఏ ఘడియలో పాతేరో తెలీదు కానీ తర తరాల పెద్దల్ని మోసి మోసి అది బాగా అరిగి పోయి నునుపుదేలి నిగనిగా మెరుస్తోంది.

స్వతంత్రం రాక పూర్వం ఆ ఊరికి గుర్రాల మీదొచ్చే ఇంగ్లీషుదొరలు చల్లని వేళల్లో ఆ బొడ్రాయి మీదనే కూర్చుని - బొడ్రాయి చుట్టూ నేల మీద కూర్చొని దొరలు చెప్పేది శ్రద్ధగా వింటూ తల లాడించే 'ఇండియా వెధవల' తగ వులు తీర్చి తీర్పులు చెప్పేవారట. దాంతో ఆ బొడ్రాయికి 'దొరలబండ' అన్న మరో పేరు స్థిరపడి పోయింది.

ఏ మాటకామాట చెప్పొద్దూ? ఇంగ్లీషు దొరలు అలా ఆ బొడ్రాయి మంచి ఎన్ని తీర్పులు చెప్పినా న్యాయానికి అన్యాయం చెయ్యలేదనీ, ఇండియావాళ్ళను వెధవలని ఎప్పుడూ అన్లేదనీ - ఆ రోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ చెప్పేవాడు; రాలిపోయినవాళ్ళు రాలిపోగా వృద్ధులై ఇంకా బ్రతికుండి మూడు కాళ్ళ మీద నడుస్తున్న అప్పటి తరం వాళ్ళు చెప్పే దాని ప్రకారం తెల్లోడు మంచోడు...

బస్తా బియ్యం అర్రూపాయిలకు అమ్మించాడనే కాదు 'తమ్ముడు తన వాడైనా ధర్మం చెప్పే 'వాడని మెచ్చుకుంటారు.

అప్పుడెప్పుడో పంటలు కళ్లాల మీదుండగానే శిస్తు వసూళ్లకొచ్చిన రెవిన్యూ దొరవారు పగలంతా ప్రభుత్వ కార్యంలో అలసిపోయి రాత్రికి మాత్రం నరాల తీట. తీర్చుకునేందుకు కామాక్షి కూతుర్ని కదిలించేట్ట. ఆ విషయం తెలిసిన కామాక్షి అగ్గి మీద గుగ్గిలమై సదరు విషయాన్ని గ్రామ పెద్ద రంగారావుకు చెప్పిందనీ, దాంతో ఆయన చిరునవ్వు నవ్వి "ఇంగ్లీషు దొరల కంటికి నచ్చడమే మహద్భాగ్యమైతే ఇక వాళ్ళ బాహువుల్లోనే నలగడానికి బ్రహ్మరాతుండాలని" నవ్వు చెప్పేడు - తనకు అందమైన కూతురు లేనందుకు లోలోపలే అసూయపడ్తూ.

రంగారావు చెప్పింది విని కామాక్షి కాండ్రించి ముఖం మీద ఉమ్మింది. అయినా "వెధవ ఇండియా బుద్ధులు" అని సరిపెట్టుకున్నాడు కానీ కామాక్షిని కించిత్తు మాట కూడా అన్లేదు రంగారావు.

వారం రోజులు గడిచాయి.

ఓ రోజెవరో రెవిన్యూ శాఖ జిల్లా దొర మళ్లీ ఆ ఊరొచ్చాడు. అలవాటు ప్రకారం దొరల బండ మీద కూర్చుండి గ్రామస్తుల కష్ట సుఖాలు విచారించాడు.

అత్తెసరు అన్నంలా లోలోపలే కుతకుతా ఉడికి పోతున్న కామాక్షి తాలూకా స్థాయి ఇంగ్లీషు దొర చేసిన ఘనకార్యాన్ని జిల్లా దొరకు మొరపెట్టుకుంది.

అప్పుడు అక్కడే వున్న రంగారావు కామాక్షి కేసి గుర్రుగా చూశాడు.

కామాక్షి కుటుంబానికి ఓ దారి చూపించేందుకు కూతుర్ని దొరతో తొంగోబెట్టమని జాత్యభిమానంతో సలహా ఇస్తే, ఆ ముండ కేకరిచ్చి ముఖం మీదే ఉమ్మేసి పోయింది! అసలీ ఇండియా వెధవలకు విశ్వాసమన్నదే లేదు...

'అయినా... కామాక్షి పిచ్చి కానీ తెల్లోళ్ళకు మాత్రం జాత్యభిమానం వుండదూ? తెల్లవాడి మీద తెల్లవాడు చర్యలు తీసుకుంటాడా...?' అనుకుంటూ రంగారావు దొర చూడకుండా పక్కకు తిరిగి కిసుక్కున నవ్వేడు.

కానీ -

రంగారావు అంచనాలు తప్పని తెలీడానికి ఎంతో సేపు పట్టలేదు. కామాక్షి ఫిర్యాదు అందుకొన్న జిల్లా తెల్ల దొర అక్కడి కక్కడే తాలూకా దొరను సస్పెండు చేసి విచారణకు ఆదేశాలిచ్చాడు.

రంగారావుకు మాత్రం బోల్డు కోపం వచ్చింది. తెల్లవాళ్ళ మీదున్న గౌరవం మొత్తం తడి బట్టతో తుడిచి నట్టు మటుమాయమైంది. 'ఇలాంటి జాత్యభిమానం లేనివాళ్ళకంటే ఆ పార్టీవాళ్ళే నయం' అనుకొని సభ ముగించి దొరవారు పట్నానికీ, ప్రజలంతా ఇళ్ళకూ వెళ్ళిందాకా అక్కడే నిలబడి అటు తరువాత మెల్లిగా వెళ్ళి బొడ్రాయి మీద ఠీవిగా కూర్చుని తీవ్రంగా ఆలోచించాడు రంగారావు.

మరి రెండో ప్రపంచ యుద్ధంతో బలహీనపడో, లేక 'క్విట్ ఇండియా' అన్నారని సిగ్గుపడో తెలీదు కానీ తెల్లవాడు మాత్రం ఇండియాను వదలి పెట్టి జండా ఎత్తేసేడు.

1947 ఆగస్టు 15 పొద్దున్నే దేశం మొత్తం స్వేచ్ఛావాయువుల్ని పీల్చుకుంటూ ఘనంగా వేడుకలు జరుపుకుంటుంటే కామాక్షి కూతురు భారతమ్మ మాత్రం పిడకల పేడకోసం గేదెల్తో కలిసి పొలం వెళ్ళింది - మళ్ళీ తిరిగి రాలేదు.

భారతమ్మ కోసం కామాక్షి ఎంత వెతికినా ప్రయోజనం లేక పోయింది. కానీ మూడ్రోజులకు కాబోలు... పొలానికి కొంచెం దూరంగా వున్న పాడు బడ్డ బావిలో భారతమ్మ నగ్న శరీరం శవంలా పైకి తేలింది.

పొలానికి మరి కొంచెం దూరంలో అంటే పాడు బడ్డ బావికి ఉత్తరం వైపు పగిలిపోయిన గాజులు, చిరిగి పోయిన లంగా, ఓణీ ముక్కలూ పొదల పక్కనే కనిపించాయి. వాటిని, భారతమ్మ శవం తీరునూ బట్టి 'భారతమ్మను పాడు చేశారు' అని నిర్ధారణ అయింది.

భారతమ్మ విషయంలో ఆరా తీయగా, తీయగా కామాక్షికి కాటికాపరి చెవిలో చెప్పిందాని ప్రకారం -

భారతమ్మ పాడు చెయ్యబడిన సమయంలో రంగారావు పంచె సవరించుకుంటూ, బిత్తర చూపులు చూస్తూ ఆ పొదల్లోంచి లేచి వస్తూ కనిపించాడు!

కామాక్షి మళ్ళీ అగ్గిమీద గుగ్గిలం అయింది. కాని

అప్పటికే రంగారావు జాతీయ పార్టీలో చేరిపోయి చాలా పెద్ద లీడరయ్యాడు.

అయినా కడుపుకోత భరించలేక కామాక్షి ఒంటరిగానే రంగారావును నిలదీసి అడిగింది.

రంగారావు అప్పుడూ కోపగించనే లేదు. కోర మీసాల్లోంచి వంకరగా నవ్వుతూ "నేను భారతమ్మను పాడుచేసి చంపుతానా? వెధవ ఇండియా బుద్ధులు కాకుంటే..." అని మందలించి పంపేడు.

యథాప్రకారం కామాక్షి తన గోడును పై అధికారులకు, జాతీయ కాంగ్రెస్ నాయకులకూ వెళ్ళబోసుకుంది.

కామాక్షి నించి రిపోర్టు అందగానే పోలీసులు, రెవిన్యూ అధికార్లు, కొంతమంది నాయకులూ ఆఘమేఘాల మీద ఆ వూరొచ్చి పడ్డారు.

ఆ రాత్రి రంగారావింట్లో విందు జరిగింది. గ్లాసుల గలగలలతోపాటు పొందుకోసం పట్నం నుంచి రప్పించిన నెరజాణల చిలిపి నవ్వులతో రంగారావింట్లో ఆ రాత్రి స్వర్గం దిగి వచ్చినట్టయింది.

ప్రొద్దున్నే అధికారులు వెడుతూ, వెడుతూ కాలు జారి పొరబాటున బావిలో పడి మృతిచెందిన భారతమ్మకు సంతాపం తెలిపారు. అంతేకాకుండా కామాక్షికి సానుభూతితో జాతీయ ప్రభుత్వం మాట పదహారు రూపాయిలు ఇవ్వబోయింది.

కామాక్షి అందుకుంటేనా? దాన్ని తిరస్కరిస్తూ భోరున ఏడ్చింది.

ఆ రోజు - బొంద్రాయిని చూస్తూ గత జ్ఞాపకాల వలయంలో మళ్ళు తిరిగి అలసి పోయిన కామాక్షి భారతమ్మ గుర్తొచ్చి మళ్ళీ ఏడ్చింది.

ఆ రోజు ఆగష్టు 15. భారతమ్మ చనిపోయి చాలా కాలమైంది. కామాక్షి కూడా చావు కోసమే ఎదురు చూస్తోంది. కానీ పాడు చావు వచ్చి చస్తేనా? అయినా చచ్చేదాకా పొట్ట పోసుకోవాలి కనుక అంత వృద్ధాప్యంలోనూ కామాక్షి ఇంకా పేడకళ్ళు తెస్తూనే వుంది. పిడకలు చేసి అమ్మి బ్రతుకు నావ ఈదుస్తూనే వుంది.

ఎండమండిపోతోంది. నీరసంగా మళ్ళీ తలెత్తి దొరల బండ కేసి చూసింది కామాక్షి. అది నిగనిగా మెరుస్తూనే వుంది.

గ్రామానికి అది ధర్మపీఠం. దాని మీద గతంలో తెల్లదొరలు కూర్చుండేవాళ్ళు. వాళ్ళు వెళ్ళిం దగ్గిర నుంచీ రంగారావే కూర్చుని తీర్పులు చెప్తూనే వున్నాడు. తెల్లవాడి కాలంలో ఆ బండ చెప్పిన న్యాయం అది. మన వాడి కాలంలో ఆ బండ చెప్పిన న్యాయం ఇది...

భారతమ్మ మళ్ళీ గుర్తొచ్చి ముసలి నగ్గు కామాక్షి రెండు కళ్ళలో కన్నీళ్ళు తళుక్కు మన్నాయి. "వెధవ ఇండియా' బుద్ధులు కావురా... 'ఇండియా వెధవ' బుద్ధులు" అప్రయత్నంగానే అంది కామాక్షి. ఆమె చేతులు పక్కనే వున్న పేడబుట్టలోకి వెళ్ళి పేడను చిన్న చిన్న ముద్దలు చేశాయి. ఒక్కో ముద్దా తీసి బొంద్రాయి మీద పేడకళ్ళు కొట్టింది కామాక్షి. బొంద్రాయి చుట్టూ పేడ కళ్ళు కొట్టడం పూర్తయిం తరువాత "థూ..." అని ఉమ్మేసి తిరిగ్గా పిడకల్ని లెక్కేసింది.

మొత్తం 42!



# ఆరుద్ర 'దక్షిణ వేదం'



'తిరుక్కురళ్'కు తెలుగు సేత

### 126. విగ్రహం తగ్గుట

విగ్రహమ్ము తలుపు; నెరసిగ్గులు గడియ
ఎదను కామమింక యిడియగొట్టు

కామమొకటె సుంత కరుణైన లేనిది
నాదు మానమేలు నడికిరేయి

కామమెంత నేను గట్టిగా నదిమిన
తుమ్మునోలె వెలికి త్రోసుకొచ్చు

విందు విగ్రహోన్న ముండగాదలచితి
మదిని కామమింత మాటుపడదు

నెడలినట్టి వారి వెంట పోవుటకల్ల
కామపీడితులకు కలదె తెలివి

చెలుని వెంట బోన తలచెదు నావెత
యెట్టి దౌను? మేలు వుట్టి పడునె?

కామకేళి ప్రియుడు కావించు సమలకు
చెలియ సిగ్గుపడుట తెలియనమ్మ

పచ్చి మోసగాని పలుకుల తీపులే
ఆడతనము వణచు ఆయుధాలు

అలగదలచి వాని కెలకుల కేగితి
కలయగోరి కరిగి కౌగలిస్తి

మంటకరుగు క్రొవ్వు, మదియున్న యెలనాగ
అలగగలదె? రతుల తొలగ గలదె?!

### 127. పరస్పర వాంఛ

చూచి, చూచి, కనులు పోయగమ్ముని నీడె
లెక్కపెట్టి వేళ్ల చిక్కిపోయె.

మరతునేని నేడు మరుజన్మలో గూడ
నేను చిక్కి నగలు మిగులబోవు

జయము గోరు యెడద పై దోడుగానె
అతని రాక కోర బ్రతుకునిలచె

నేడు చిగురువేసె మోడైన హృదయమ్ము
వలపుతోడ చెలుడు వచ్చెననుచు

తగ్గినట్ట కళలు తనువు మరల జేరు
కన్నులార చెలుని కాంచగానె

ఇల్లు చేరును చెలుడేనాటికైనను:
సంతదీర ప్రణయవాంఛ సందు.

చెలుదు రాగ మొదట యలుగుటా?
పెనగుటా?
చెలగి రెండు నొకట చేతునేమొ.

పోరిరాజు గెలువ పొలతి ఇంటికిపోయి
మాపునందు కుడుతు మంచి విందు.

ఒక్క దినము చాలు ఒక వారమై తోచు
తిరిగి వచ్చువాని తెరువు జూడ.

చూడగలిగి పతిని కూడిన ఫలమేమి
నేచి గుండె పగిలి వెలది తొలగ.

### 128. మనోభావాలు

కట్టుదప్పి నీదు కాటుక కన్నులు
చెప్పనేర్చు నీవు చెప్పకున్న.

కనుల విందు జేయగల వేణుహస్తకు
ఆడవెడగుతనము చూడ జాస్తి.

మణి సరమ్ములోన కనిపించు ప్రోగట్లు
వెలది చక్కనెడద తలపుతోచు.

మొగ్గలోన తావి ముకుళించియున్నట్లు
తరుణి నవ్వులోన దాగెనేదో.

చెలియ యేగునపుడు చేసిన చేష్టలో
మరుల వెతల దీర్చు మందుగలదు.

అకట! నీదునన్న అనుమాన ముదయించె
ప్రియుని కౌగలింత బిగువు తెలియ.

ముందు తెలుసుకొనెను ముంజేతి కడియాలు
చెలుని మనసులోని చలి తలంపు.

నిన్న వెన్నెకాదు నన్ను నీడెనుగాని
వన్నె తరిగి నాకు వారమాయె.

కంకణాలు జూచె, కరములు తాజూచె
కాళ్ళు జూచె చెలియ కామనేమొ.

కనుల తోడ చెప్పగలుగు కామితమెల్ల
పలుకులేక నేడగలదు లలన.